బోనాల జాతర ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్‌, అధికారులు

మల్కాజిగిరి: మల్కాజిగిరిలో జరిగే ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర సందర్భంగా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై దేవాలయం వద్ద గురువారం కార్పొరేటర్‌ శ్రవణ్‌ అధ్యక్షతన అధికారుల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. బోనాల సందర్భంగా మూడు రోజులూ మంచినీటి సరఫరా చేయాలన్నారు. బోనాలు తీసుకొచ్చే మహిళలకు ఇబ్బంది లేకుండా ప్రధాన రహదారి నుంచి దేవాలయం వరకు చెట్ల కొమ్మలను తొలగించాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ నుంచి పరిసరాల్లో పరిశుభ్రంగా ఉండాలని, అన్ని దేవాలయాలకు వెళ్లే రహదారులకు తాత్కాలికంగా మరమ్మతులు చేయాలన్నారు. జలమండలి విభాగం ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లలో ఉచితంగా మంచినీటి సరఫరా చేయాలని, పోలీసు విభాగం ఆధ్వర్యంలో ఎక్కువ మంది మహిళా సిబ్బంది విధుల్లో ఉండేలా చూడాలని కోరారు. సమావేశంలో సర్కిల్‌ డీసీ రాజు, ఇన్‌స్పెక్టర్‌ సత్యనారాయణ, డీఐ శ్రీశైలం, ఏడీఈ యాదగిరి, డీజీఎం అశ్రిత, హార్టికల్చర్‌ మేనేజర్‌ మహేశ్వరి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్‌

రామంతాపూర్‌: డివిజన్‌ పరిధిలోని వివిధ అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని కార్పొరేటర్‌ బండారు శ్రీవాణి వెంకట్‌రావు కోరారు. ఈ మేరకు గురువారం ఈస్ట్‌ జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ కేశవ్‌ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. డివిజన్‌ పరిధిలోని ఇందిరానగర్‌ నుంచి నేతాజీనగర్‌ వెళ్లే డ్రైన్‌ పనులకు, అదే విధంగా ఇందిరానగర్‌ శేఖర్‌ బస్తీ నుంచి గంగా ఆలయం వరకు కొత్త రోడ్డు నిర్మాణం కోసం, రెండు హిందూ శ్మశాన వాటికల అభివృద్ధి కూడా నిధులు మంజూరు చేయాలన్నారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కరిస్తాం

మల్లాపూర్‌: ఎక్కడా కూడా లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా పరిష్కరిస్తామని ఎస్‌ఈ సుబ్రమణ్యం అన్నారు. గురువారం మల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలోని ఓల్డ్‌ మల్లాపూర్‌, పఠాన్‌ బస్తీలో పర్యటించారు. విద్యుత్‌ సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా లో ఓల్టేజీ, నూతన పోల్స్‌, కొత్త లైన్‌లు వేయాలని ఎస్‌ఈని కోరారు. పనులు ప్రారంభించి 10 రోజుల్లో పూర్తి అయ్యేలా చూడాలని ఎస్‌ఈ ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ సత్తమ్మ, ఏడీఈ దశరత్‌, ఏఈ సాయిపూజ, డివిజన్‌ అధ్యక్షులు సాయి, బాలరాజ్‌ గౌడ్‌, శ్రీనివాస్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వినియోగదారులతో మాట్లాడుతున్న ఎస్‌ఈ

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత



స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

కుషాయిగూడ: సామాజిక బాధ్యతగా మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని చర్లపల్లి పారిశ్రామికవాడలోని హిందుస్థాన్‌ పెట్రోలియం కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా లిమిటెడ్‌ (హెచ్‌పీసీఎల్‌) డీజీఎం ఆనోజ్‌శ్యాం బిహారిలాల్‌ బరోనియా అన్నారు. హెచ్‌పీసీఎల్‌లో జూలై 1 నుంచి 15 వరకు జరుగుతున్న స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా గురువారం చర్లపల్లి చెరువు వద్ద సంస్థ ఉద్యోగులు స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టారు. పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ.. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం, ప్లాస్టిక్‌ నియంత్రణ వంటి అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యాసాగర్‌ గుప్తా, శశిధర్‌రెడ్డి, శశాంక్‌, కృష్ణ, కాంట్రాక్టర్‌ వెంకట్‌, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల్లో నీరు నిలువ ఉండొద్దు

మల్లాపూర్‌: మన చుట్టూ ఉండే పరిసరాలు, ఇళ్లలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని ఎంటమాలజీ సూపర్‌వైజర్‌ నర్సింహ అన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆదేశాల మేరకు దోమల నివారణ వాటి ద్వార వ్యాపించే వ్యాధులపై నాచారంలోని ప్రభుత్వ పాఠశాలతో పాటు పలు ప్రయివేట్‌ పాఠశాలలో గురువారం ఎంటమాలజీ సిబ్బంది అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ, చికెన్‌ గున్యా, బోధకాల వ్యాధి, సీజనల్‌ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంటమాలజీ సిబ్బంది బాబు, మహేష్‌, లక్ష్మణ్‌, రాము, రవీందర్‌, రాజు, మహేష్‌, బాలరాం పాల్గొన్నారు.



నాచారంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

సీజనల్‌ వ్యాధులపై అవగాహన

ఉప్పల్‌: సీజనల్‌ వ్యాధులపై ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ ఆంజనేయులు ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఎంటమాలజీ, శానిటరీ విభాగం అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇళ్లు, ఇంటి చుట్టు ప్రక్కల నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేకుంటే దోమలు వృద్ధి చెందుతాయని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



గ్యాంగ్‌వార్‌!

- సౌత్‌ కమలానగర్‌ వీధుల్లో విద్యార్థులు, పోకిరీల గుంపులు
- గ్రూపులుగా ఏర్పడి ఒకరిపై ఒకరు దాడులు
- ఉదయం, సాయంత్రం నిత్యం ఘర్షణలే..
- ఇబ్బంది పడుతున్న కాలనీ వాసులు

కుషాయిగూడ: ఉదయం, సాయంత్రం కళాశాలల సమయాల్లో విద్యార్థుల తోపులాటలతో వీధులు దద్దరిల్లుతున్నాయి. గ్యాంగ్‌లుగా ఏర్పడి ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నారు. దీంతో కమలానగర్‌ వాసులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా కళాశాల యాజమాన్యాలు, పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులతో కిటకిట

ఏఎస్‌రావునగర్‌ డివిజన్‌, సౌత్‌ కమలానగర్‌లో పదుల సంఖ్యల్లో ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. నిత్యం ఉదయం, సాయంత్రం సమయాల్లో ఈ వీధులు వేల మంది విద్యార్థులతో కిటకిటలాడుతుంటాయి. కళాశాలల్లో విద్యార్థుల మధ్య చోటు చేసుకునే చిన్న చిన్న గొడవలను మనసులో పెట్టుకొని వారికి సంబంధించిన (కళాశాలలకు సంబంధం లేని వారు) వారిని ఇక్కడికి పిలిపించుకోవడం, కళాశాలలు వదలగానే కాపు గాసి వారిని చుట్టుముట్టడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. అసభ్య పదజాలంతో తిట్టుకుంటు పరస్పరం దాడులు చేసుకుంటున్నారు. మరుసటి రోజు మరో గ్యాంగ్‌ రావడం.. వారి కోసం కాపు గాసి వారిపై ప్రతీకార దాడులకు పాల్పడటం నిత్యకృత్యంగా మారింది. ఈ క్రమంలో ఆ వీధుల్లో నివసించే వారితో పాటు వ్యాపారాలు చేసుకునే వారు విద్యార్థుల గొడవలతో విసిగిపోతున్నారు. సినిమాను తలపించేలా గొడవలు జరుగుతున్నాయి. ఇళ్ల ముందు గుంపులు, గుంపులుగా ఉంటూ వారికి అసౌకర్యం కల్పిస్తున్నారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి గొడవలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు. ఉదయం, సాయంత్రం కళాశాలల సమయాల్లో ఈ వీధుల వెంట పోలీసు పెట్రోలింగ్‌ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

దమ్మాయిగూడ మున్సిపల్‌ భవానీనగర్‌ కాలనీలో ప్రమాదకరంగా ఇళ్ల మధ్యలో ఓపెన్‌ మురుగు కాలువ ఇలా..





ఇలా ఉంటే బతికేదెలా ?

- ప్రమాదకరంగా ఓపెన్‌ మురుగు కాలువ
- గత ప్రభుత్వంలో హయాంలో హడావుడిగా ప్రారంభం
- పనులు పూర్తి చేయాలని ప్రజల వినతి

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీలో నిరుపేదలు నివసిస్తున్న భవానీనగర్‌కాలనీలో ప్రజలు వివిధ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇళ్ల మధ్యలో నుంచి ప్రహిస్తున్న ఓపెన్‌ మురుగు కాలువతో ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇళ్ల మధ్యలో నుంచే సుమారు 8 నుంచి 10 అడుగుల వెడల్పుతో ఉన్న మురుగునీటి కాలువ ప్రమాదకరంగా ఉంది. మురుగు కాలువపై తాత్కాలికంగా విద్యుత్‌ స్తంభాలు, చెక్కలు, కర్రలతో ఏర్పాటు చేసుకున్న వాటిపై నుంచి ఇళ్లలోకి రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.

◆ వర్షాకాలంలోనైతే ప్రస్తుతం వస్తున్న మురుగుతో పాటు, దమ్మాయిగూడ మున్సిపల్‌ పరిధిలోని పెద్ద చెరువు, నాసిన్‌ చెరువుల నుంచి కుడా పెద్దఎత్తున వరదనీరు ప్రహిస్తుంటుంది. ఆ సమయంలో ఇళ్ల నుంచి రాకపోకలు సాగించాలంటే కష్టంగా ఉందని స్థానికులు వాపోతున్నారు.

◆ గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే మల్లారెడ్డి భవానీనగర్‌ కాలనీలో ఓపెన్‌ మురుగు నీటి కాలువ సమస్యను పరిష్కరించేందుకు హెచ్‌ఎండీ నుంచి నిధులు మంజూరు చేయించి ఎన్నికలకు ముందు పనులను ప్రారంభించారు. అనంతరం ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారడంతో పనుల్లో పురోగతి కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం మంజూరైన నిధులు నిలిచిపోయాయని అధికారులు చెబుతున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్గంధం.. దోమల బెడద..

ఓపెన్‌ కాలువతో ఈగలు, దోమల బెడదతో పాటు, దురాస్వనతో తాము రోగాల భారిన పడుతున్నామని, రాత్రివేళల్లో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటుందని వాపోతున్నారు. వీధిదీపాలు కుడా లేకపోవడంతో తమ పరిస్థితి మరింత అధ్వానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదకరంగా ఉన్న మురుగునీటి కాలువకు డ్రైయిన్‌ పైపులైన్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్‌ శాంతి

అల్వాల్‌: సీజనల్‌ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్‌ శాంతిశ్రీనివాస్‌ రెడ్డి అన్నారు. అల్వాల్‌ సర్కిల్‌ ఏఎంవోహెచ్‌ మంజుల ఆధ్వర్యంలో వార్డు కార్యాలయంలో గురువారం సీజనల్‌ వ్యాధులు, పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. డివిజన్‌ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపర్చాలన్నారు. కార్యక్రమంలో నవీన్‌, ప్రేమ్‌, గిరి, అరుణ్‌, మల్లేష్‌గౌడ్‌, రాజు, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం

జవహర్‌నగర్‌ : మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా ఉత్తమ ఆరోగ్య అధికారిగా జవహర్‌నగర్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి షౌకత్‌అలీ అవార్డు అందుకున్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో 'రాష్ట్ర పబ్లిక్‌ హెల్త్‌ అండ్‌ ఫ్యామిలీ వెల్ఫేర్‌' డైరెక్టర్‌ డాక్టర్‌ రవీంద్రనాయక్‌, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్‌ రఘునాథ్‌ స్వామిల చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని, జిల్లా ఉత్తమ ఆరోగ్య అధికారిగా అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.

రూ. 5.67లక్షలకు తైబజార్‌ వేలం

పోచారం: మున్సిపాలిటీ పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరానికి తైబజార్‌ రుసూం వసూలు చేసేందుకు గురువారం వేలంపాట నిర్వహించారు. వేలంలో పాల్గొన్న ముగ్గురిలో అత్యధికంగా రూ.5.67 లక్షలకు అన్నోజిగూడకు చెందిన కొక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్‌ తైబజార్‌ హక్కులను దక్కించుకున్నారు. చైర్మన్‌ కొండల్‌రెడ్డి, కమిషనర్‌ వేమనరెడ్డి, వైస్‌ చైర్మన్‌ రెడ్యానాయక్‌ తదితరుల సమక్షంలో వేలం పాట కొనసాగింది.

ముగిసిన హ్యాకథాన్‌

మేడ్చల్‌ రూరల్‌ : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ (ఎమ్మార్‌సీఈ) కళాశాలలో ఐఐసీ ఆధ్వర్యంలో 4 రోజుల పాటు సాగిన హ్యాకథాన్‌ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొని సమకాలిక సమస్యలకు పరిష్కారాలు సూచించారు. రైతుల సమస్యలను యాప్‌, వెబ్‌సైట్‌, రోబోల ద్వారా పరిష్కారం చూపారు. రైతులు టెక్నాలజీ సాయంతో నాణ్యమైన విత్తనాలు, పురుగుల మందు వాడకం, పంటల సాగు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా గిట్టుబాటు ధరలను పొందే విధానాలను ఆవిష్కరించారు. అత్యుత్తమ ఆవిష్కరణలకు ప్రిన్సిపల్‌ బహుమతులు, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్‌ అశోక్‌, ఐఐసీ కన్వీనర్‌ అధిరాజ్‌, విద్యార్థి కన్వీనర్లు ఆదిత్య, మనీష్‌, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మకర తోరణానికి ఎమ్మెల్యే విరాళం

గౌతంనగర్‌: ఆషాఢమాసం సందర్భంగా యాదవనగర్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సమేతంగా గురువారం హాజరై పూజలు నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారి మకర తోరణానికి రూ.75 వేలను విరాళంగా అందజేశారు. అదేవిధంగా కార్పొరేటర్‌ 11,116 రూపాయలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి మర్రి మమత, మాజీ కార్పొరేటర్‌ జగదీష్‌గౌడ్‌, నాయకులు మేకల రాముయాదవ్‌, జేఏసీ వెంకన్న, శ్రీరాములు యాదవ్‌, లక్ష్మణ్‌యాదవ్‌, భైరు అనీల్‌, నర్సింగ్‌రావు, కిట్టు, అనిత, శైలజ, లీలా, వరలక్ష్మి పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్‌

రైల్వే సమస్యలను పరిశీలించిన ఎంపీ



అధికారులతో చర్చిస్తున్న ఎంపీ ఈటల

అల్వాల్‌: మల్కాజిగిరి నియోజకవర్గంలోని రైల్వే సమస్యలను గురువారం ఎంపీ ఈటల రాజేందర్‌ రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముంబై, కరీంనగర్‌, మౌలాలి రైల్వే లైన్‌లతో మల్కాజిగిరి నియోజకవర్గం రైల్వే చక్రబంధంగా మారిందన్నారు. ట్రాఫిక్‌ రద్దీని నివారించడానికి అవసరమగు రైల్వే ఓవర్‌ బ్రిడ్జి, అండర్‌ బ్రిడ్జి మంజూరైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సహకారం లేకపోవడం వల్ల వాటి నిర్మాణం జరుగడం లేదన్నారు. అంతకుముందు అల్వాల్‌, వెంకటాపురం, సుచిత్ర సర్కిల్‌, తుర్కపల్లి, అమ్ముగూడ, ఓల్డ్‌ నేరేడ్‌మెట్‌, వినాయక్‌నగర్‌, సఫిల్‌గూడ, ఆనంద్‌బాగ్‌, ఉప్పరిగూడ, గౌతంనగర్‌ రైల్వే స్టేషన్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు సుబ్రహ్మణ్యం, రామారావు, శ్రీనివాస్‌, కార్పొరేటర్‌లు రాజ్యలక్ష్మి, శ్రవణ్‌కుమార్‌, నాయకులు విక్రంరెడ్డి పాల్గొన్నారు.

సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాన్ని అల్వాల్‌కు తరలించాలి

అల్వాల్‌: వల్లభ్‌నగర్‌లోని అల్వాల్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాన్ని అల్వాల్‌కు తరలించాలని అల్వాల్‌కు చెందిన పలువురు నాయకులు గురువారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు వినతిపత్రం అందజేశారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హన్మంతరావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దుంగడుల వెంకటేష్‌, మల్లికార్జున్‌యాదవ్‌, ప్రదీప్‌, హర్షవర్ధన్‌ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్‌: 11 కేవీ మల్లాపూర్‌ నర్సింహానగర్‌ ఫీడర్‌ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు వల్ల శుక్రవారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు లక్ష్మీనగర్‌, మీర్‌పేట్‌, ఎన్టీఆర్‌నగర్‌, నర్సింహానగర్‌, న్యూ నర్సింహానగర్‌, శాంతినగర్‌ కాలనీలో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నాచారంలో....

33/11 కేవీ నాచారం ఇండోర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ సాయిబాబా టెంపుల్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్నపూర్ణ కాలనీ, రాఘవేంద్రనగర్‌, సాయినగర్‌ పార్క్‌, రవీంద్రనగర్‌ పార్క్‌లో విద్యుత్‌ అంతరాయం ఉంటుందని నాచారం విద్యుత్‌ ఏఈ నాగరాజు తెలిపారు.

రామంతాపూర్‌ : ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గోఖలేనగర్‌, కెన్యా గ్రౌండ్‌ మెయిన్‌ రోడ్డు, ఇందిరానగర్‌, ప్రగతినగర్‌ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ రాములు తెలిపారు. విద్యుత్‌ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో 11 కేవీ ఆర్‌కేనగర్‌ ఫీడర్‌ పరిధిలో మరమ్మతుల వల్ల ఆర్‌కేనగర్‌, చాణక్యపురి కాలనీ, సినీపోలీస్‌ ప్రాంతాల్లో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం కలుగనుంది. అదేవిధంగా 11 కేవీ బాలసరస్వతీనగర్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు విష్ణుపురికాలనీ, విష్ణుపురి ఎక్స్‌టెన్షన్‌, విమలాదేవినగర్‌, ఆనంద్‌బాగ్‌, రాజీవ్‌ గాంధీ నగర్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్‌ తెలిపారు.

ఉప్పల్‌: విద్యుత్‌ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జేఎస్‌ఎన్‌ కాలనీ, గాంధీ గిరిజన బస్తీ, వివేకానందనగర్‌, రవీంద్రనగర్‌ రోడ్డు నంబర్‌ 6 నుంచి 27 వరకు తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదని ఏఈ రామిరెడ్డి తెలిపారు.

ఉప్పల్‌ పారిశ్రామిక వాడలో..

ఉప్పల్‌ పారిశ్రామిక వాడ 11 కేవీ ఎగ్‌వుడ్‌ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు ఉప్పల్‌ స్టేడియం రోడ్డు, పారిశ్రామిక వాడ, ఐడీఏ కార్యాలయం తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ నిఖిల్‌ తెలిపారు.

మేడిపల్లి: 11కేవీ బుద్ధానగర్‌ ఫీడర్‌ 33/11కేవీ పీఅండ్‌టీ ఎస్‌ఎస్‌ ఫీడర్‌ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్ధానగర్‌, మల్లికార్జున నగర్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారి హరినాథ్‌ తెలిపారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



కుషాయిగూడ: అకారణంగా సిద్దిపేటలో న్యాయవాది రవికుమార్‌పై పోలీసుల దాడిని నిరసిస్తూ గురువారం కుషాయిగూడలోని మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. న్యాయవాదుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. రవికుమార్‌పై జరిగిన పోలీసుల దాడిని మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లా కోర్టు బార్‌ అసోసియేషన్‌ తీవ్రంగా ఖండించింది. కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ ప్రతినిధులతో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్‌..

– జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి

సాక్షి, మేడ్చల్‌ జిల్లా : ప్రత్యేక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్‌ సెల్‌ను ఏర్పాటు చేసిందని, గృహిణి, పాఠశాలలు, కళాశాలల స్థాయి విద్యార్థులు, విద్యావేత్తలు, వ్యవసాయదారులెవరైనా ఇంటింటా ఇన్నోవేటర్‌ కార్యక్రమంలో పాల్గొనవచ్చని జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం అదనపు కలెక్టర్‌ కార్యాలయ ఛాంబర్‌లో నిర్వహించిన ఇంటింటా ఇన్నోవేటర్‌ వాల్‌ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ.. స్థానిక సమస్యలను పరిష్కరించే వినూత్న ఆవిష్కరణలు పంపించే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా కల్పిస్తున్నామన్నారు.

ప్రతి ఒక్కరికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఇంటింటా ఇన్నోవేటర్‌ సెల్‌ ఏర్పాటు చేసిందని, గృహిణి నుంచి పాఠశాలలు, కళాశాలల స్థాయి విద్యార్థులు, విద్యావేత్తలు, వ్యవసాయదారులు ఎవరైనా పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

దరఖాస్తు చేసుకునేదెలా.. ?

◆ పేరు , వయస్సు , ఫోటో , వృత్తి , చిరునామా , మండలం , జిల్లా .
◆ ఆవిష్కరణ పేరు.
◆ ఆవిష్కరణను వివరిస్తూ 100 పదాల్లో రాసి పంపండి.
◆ ఆవిష్కరణ 4 ఫోటోలు.
◆ ఆవిష్కరణ వీడియో 2 నిమిషాలు.

పైన చెప్పిన వివరాలు తెలంగాణ ఇన్నోవేటర్‌ సెల్‌ వాట్సాప్‌ నెంబర్‌ 9100678543కు గడువు తేదీలోగా పంపించాలని ప్రకటించారు. దరఖాస్తుకు చివరి తేదీ 3 ఆగస్టు 2024.


◆ ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందని వివరించారు. డీఆర్‌డీఏపీడీ సాంబశివరావు, డీపీఓ వెంకయ్య, వ్యవసాయ అధికారి రేఖమేరీ, జిల్లా అధికారి భాను ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

'రైతుబంధు' లో బయటపడ్డ అక్రమాలు

ఐదేళ్లుగా రైతుబంధు తీసుకుంటున్న వైనం
కలెక్టర్‌కు నివేదించిన తహసీల్దార్‌
రికవరీ యాక్ట్‌ ప్రకారం చర్యలకు సిద్ధం

ఘట్‌కేసర్‌: పోచారం మున్సిపాలిటీ రెవెన్యూ పరిధిలో లేఅవుట్‌కు ఐదేళ్లుగా రైతుబంధు తీసుకుంటున్న రైతు భూమి పాస్‌బుక్కును తహసీల్దార్‌ రజని గురువారం బ్లాక్‌ చేశారు. పోచారం మున్సిపాలిటీలో సర్వేనంబర్లు 38, 39, 40లోని 33 ఎకరాల విస్తీర్ణంలో 1981లో వెంచర్‌ చేశారు. ప్లాట్లు చేసి విక్రయించిన భూమిని నాన్‌ అగ్రికల్చర్‌ ల్యాండ్‌గా అధికారులు రికార్డు మార్చకపోవడంతో రైతు తిరిగి దొడ్డి దారిన పాస్‌బుక్స్‌ పొందాడు. అప్పటి నుంచి ఆ భూమికి రైతుబంధు కింద రూ. 16.80 లక్షలు తీసుకున్నాడు. స్థానికుడి ఫిర్యాదుతో విషయం వెలుగులోకి రావడంతో అధికారులు విచారణ చేపట్టి దిద్దుబాటు చర్యలు చేపట్టారు. రెవెన్యూ రికవరీ యాక్ట్‌ కింద తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ స్థానిక తహసీల్దాను ఆదేశించారు. దీనిపై తహసీల్దార్‌ రజనిని వివరణ కోరగా.. అక్రమంగా రైతుబంధు పొందిన రైతు పాస్‌బుక్స్‌ బ్లాక్‌ చేశామని, కలెక్టర్‌కు నివేదిక అందజేశామన్నారు. కలెక్టర్‌ నుంచి రెవెన్యూ రికవరీ యాక్ట్‌ కింద రైతుబంధు డబ్బులు రైతు నుంచి వసూలు చేయాలని కలెక్టర్‌ నుంచి నోటీసు అందగానే సంబంధిత రైతుకు నోటీసు ఇచ్చి రెవెన్యూ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

మల్లారెడ్డి కళాశాలకు అటానమస్‌ హోదా



మేడ్చల్‌ : పట్టణ పరిధిలోని కిష్టాపూర్‌లోని మల్లారెడ్డి ఇంజినీరింగ్‌ కళాశాల (ఎంఆర్‌ఈఎం) యూనివర్సిటీ గ్రాంట్స్‌ కమిషన్‌ ద్వారా అటానమస్‌ స్టేటస్‌ పొందిదని కళాశాల చైర్మన్‌ వేముల మల్లారెడ్డి తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన తమ కళాశాల వివరాలను వెల్లడించారు. తమ కళాశాల అత్యున్నత వసతులతో నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. సాంకేతిక విద్యను అందిస్తూ.. సమాజ అభివృద్ధిలో మల్లారెడ్డి కళాశాల తన వంతు పాత్ర పోషిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌ ఎం. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ కళాశాల అటానమస్‌ స్టేస్‌ పొందడటంతో బాధ్యత మరింత పెరిగిందన్నారు. కళాశాల సెక్రటరీ కృష్ణారెడ్డి, డైరెక్టర్లు రాఘవేందర్‌రెడ్డి, భరతసింహా రెడ్డి, సుబ్బరత్నం హెచ్‌ఓడీలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్‌ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు



మాట్లాడుతున్న చైర్మన్‌ కొండల్‌రెడ్డి

పోచారం : వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్‌ కొండల్‌రెడ్డి అన్నారు. అన్నోజిగూడలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారులతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చికెన్‌గున్యా, డెంగీ, డయేరియా, మలేరియా, టైఫాయిడ్‌ వంటి వ్యాధులు వ్యాపించకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైస్‌ చైర్మన్‌ రెడ్యానాయక్‌, కమిషనర్‌ వేమనరెడ్డి, హెచ్‌ఎం. స్వరూపరాణి, వైద్య బృందం పాల్గొన్నారు.